264

# 44. ఓ పసిపాప కథ

'ఏంరా వాసూ, నీ లెక్కలనోట్సు తియ్యి ఎనిమిదో అభ్యాసంలో నాలుగూ, అయిదూ, లెక్కలు చెయ్యమన్నాను. చేశావా? ఏవీ చూపించు'

'చెయ్యలేదండీ '

'ఏం ఏ మొచ్చింది.'

'మా అమ్మ బజారు కెళ్ళమందండి. బయలుదేరే సరికే ఆలస్యమైపోయిందండి. వెళ్ళేసరికి కొట్టు కట్టేశారండి. తిరిగి వచ్చేసరికి ఇంట్లో కరెంటు లేదండి. ఎల్ర్టిక్ ఆఫీసుకి వెడదామాఅంటే, అంతా చీకటి అండీ. దారీ తెన్నూ తెలియలేదండి తీరా లైట్లు వచ్చేసరికి నేను నిద్దర్లో ఉన్నానటండి. ఎంత లేపినా అన్నానికే లేవలేదుగదండీ, మరి యీ లెక్కలు.....

'ఓరి వెధవా ........ అక్కడితో ఆ సోది ఆపు ఇంతకీ హోంవర్కు చెయ్యకపోడం తప్పు ఎవరిదంటావ్?'

'నాదిమాత్రం కాదండి'

'అయితే నాదనా? ఓరి వెధవా..... నీతో ఇలాకాదు..... మోనీటరూ ఏదీ బెత్తం' పెంకితనంగా జవాబు చెబుతున్న వాసు కళ్లు భయంగా బాధాపూరితంగా మారిపోయాయి మాష్టారూ...... ఇంకెప్పుడూ ఇలా చెయ్యనండి. మరెప్పుడూ ఇలా జవాబు చెప్పనండి..... ఈ సారికి కొట్టకండి' అంటూ కుడిచెయ్యి అడ్డుపెట్టేడు. బెత్తం పైకెత్తిన వెంకట్రామయ్యగారు అప్రయత్నంగా ఆ చెయ్యి ఇటు తిప్పి అరచెయ్యి వైపు చూశారు. హఠాత్తుగా ఆయనలోని అంతర్జ్వాల రగులుకుంది. అంతర్దృష్టి మేలుకుంది. ఆయనకు కనిపించిందేమిటి? నాట్యం చేసున్నప్పుడు ఊగిసలాగే చిన్న అరచేయి. గాలిస్పర్శకు పులకించి పరవశించే అయిదు రేకుల తెల్ల గులాబీపువ్వు... ఆయనకు వినిపించిందేమిటి? కొసరి కొసరి నాతో..... సరసములాడకు.... రాసలీలలోని రమ్యసందేశం గ్రహించిన రమణీయమూర్తి రాధ రసికశిఖామణితో చేసె రహస్య రాగాలాపన. మా జీవితాలతో ఆటలాడవద్దని సామాన్యుడు సర్వేశ్వరునితో మర్మగర్భంగా ప్రార్థన.

వెంకట్రామయ్యగారి అరిచేతిలోని బెత్తం జారిపోయింది. బరువైన హృదయంలో ఆయన కుర్చీలో కూలబడ్డారు.

ఇంత జరిగినాకూడా ఇవాళ వాణ్ణి కొట్టడానికి నేనెందుకు చెయ్యెత్తేను? తెలిసి తెలిసి మనుషులు నేరాలెందుకు చేస్తారు!

ఈ ప్రశ్నకు జవాబు తెలియదు. ఆయనకీ ఆ అమ్మాయికీ ఆ మధ్య జరిగిన సంఘటన పూర్తిగా వింటేనేగాని అసలా ప్రశ్న ఎందుకు పుట్టిందో తెలీదు!

✪

'అదేమిటే, అంతలోనే ముసిల్దానివయిపోయావా ఏమిటే?

మెట్లెక్కి నెమ్మదిగా లోపలికి వస్తున్న పాపని చూసి తాత నవ్వుతూ అడిగాడు. బడికి వెడుతున్నపుడు మెట్ల మీదనుంచి దిగకుండా పాప ఒక్క సారిగా అరుగుమీదనుంచి గెంతుతున్ననాడు తాత వేసిన ప్రశ్నమరొకరకంది.

'అదేమిటే అలా గెంతేశావ్? కాళ్ళు విరిగేను. జాగర్త. అయినా అలా ఒక్కసారి గట్టుమీంచి గెంతేస్తే మరి ఈ మెట్లెందుకూ?'

వీధిగేటుదాకా వెళ్ళిన పాప గిర్రున వెనక్కి తిరిగింది.

'మెట్లెందుకా, ఎందుకా, చెప్పనా?' అంటూ తాత దగ్గిరగా వచ్చి

'అవి నీలాంటి ముసలాళ్ళ కోసం ప్రత్యేకం. అవి ఎక్కి దిగవలసిన ఖర్మ మాకేం?' అని పక్కున నవ్వేసి చటుక్కున పారిపోయింది. నవ్వుతున్నప్పుడు మెఱవడానికి తాతనోట్లో పళ్ళయితే లేవుగాని కళ్ళు మిలమిలలాడేయి. పాప బడినుంచి వచ్చే వేళకు అవి మరింతగా మెరిశాయి. తల దించుకుని నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ ఒక్కొక్క మెట్టూ ఎక్కుతున్న పాపని చూడగానే తాత వయసుని ఎనిమిదిపెట్టి భాగించవలసివచ్చింది. తాత ప్రశ్నకి పాప ఏమోగాని జవాబు చెప్పలేదు; తాత ఊరుకోనూ లేదు. నెమ్మదిగా దిగి వచ్చి మెట్లమీద పాపని అడ్డుకున్నాడు.

'ఏమే. హైజంపు చేసే హైహీల్సు దొరసానిగా, ఆ మెట్లు నావీ. వాటిమీద అడుగుపెడితే కాలు విరక్కొడతాను, మాటాడవేం?'

తాత పాప కుడిచెయ్యి పట్టుకుని గట్టిగా కుదిపాడు అది 'అమ్మో' అని ఒక్క అరుపు అరిచింది. అంతే. గదిలో ఫైల్సు తిరిగేస్తున్న నాన్నా, రేడియోదగ్గిర కూర్చున్న అన్నా, జామి చెట్టు మీదున్న తమ్ముడూ, పెరట్లో మొక్కలకు నీళ్ల పోస్తున్న అమ్మా అందరూ ఒక్కసారి అక్కడ ప్రత్యక్షమయారు, ఏమయిందంటూ.

పాప కుడిచెయ్యి అరచేతి వేళ్ళు చూపించింది. బొటన వ్రేలు తప్ప తక్కిన నాలుగూ నలిగి, వాచి, నల్లబడిఉన్నాయి.

'అయ్యో ఏమయిందే నా తల్లీ' అని పాపని అమ్మ ఆప్యాయంగా ఎత్తుకుని గుండెలకి హత్తుకుంది.

'ఏముంది. ఎక్కడా కిందా మీదా ఉండకపోతే ఏమౌతుంది?' అన్నాడు నాన్న. అన్న ఇంత టించరయిడన్ పూశాడు. తాత ఏవో హోమోపతీ మాత్రలు మింగించాడు. తమ్ముడు పాప పుస్తకాలు లోపల పెట్టేడు. అమ్మ పాపచేతికి ఏదో పట్టువేసి కట్టు కడుతూ అంది!

'అయ్యో, అయ్యో లేతవేళ్ళు ఎలా కమిలిపోయాయో....... నిక్షేపంలా స్కూలికి వెళ్ళేవ్. ఇంతలో ఏమైందే మా అమ్మా! ఏ తలుపుసందునైనా వేళ్ళు ఉండిపోయాయా ఏమిటే వెర్రి తల్లీ.' పాప జవాబు చెప్పలేదు. బుగ్గలమీద నుంచి కిందకి కారుతున్న కన్నీటి చుక్కల్ని ఎడంచేత్తో తుడుచుకుంది.

'దాన్నింకా ఎందుకలా ప్రశ్నించి చంపుతారు? కాస్సేపు అటు తిరిగి పడుకుని విశ్రాంతి తీసుకోనియ్యండి. ఎలా తగుల్తేనేం చేతికి గట్టిదెబ్బే తగిలింది.' నాన్న కేకలతో అందరూ అక్కణ్ణుంచి ఆ పక్కగదిలోకి వెళ్ళి పోయారు. తమ్ముడు మాత్రం అక్కణ్ణుంచి కదల్లేదు, అక్కని వదల్లేదు.... ఎవర్తోనూ చెప్పవని 'సరస్వత్తోడు' వేయించుకున్నాక పాప వాడితో జరిగింది చెప్పింది.

వెంకట్రామయ్య మేష్టరుగారు ఆవాళ క్లాసులో డిక్టేషను చెబుతూంటే వెనక బెంచీ విశాలాక్షి రాయలేదట. అదేమని అడిగితే ఆ పిల్ల పెన్నులో సిరా అయిపోయిందని చెప్పిందట. 'ఇంటినుంచి బయలుదేరి వస్తున్నప్పుడు కలంలో సిరా ఉందో లేదో చూసుకోడానికి ఒళ్ళెరగవా, కళ్ళు మూసుకుపోయాయా!' అని ఆ అమ్మాయిని బెంచీ ఎక్కించి ఆ విషయమే ఇంకా ఉపన్యసిస్తుండగా బంట్రోతు నోటీసేదో తెచ్చి యిచ్చాట్ట. అదేదో పిల్లలకి చదివి వినిపించి సంతకం పెడదామని పక్కజేబులో పెన్ను తీసి ఎంత దులిపినా ఒక్కచుక్క ఇంకు పడలేదట. ఎవర్నో కలం అడిగి సంతకం పెట్టి పంపించేస్తుండగా పాప ఉండబట్టలేక అడిగేసిందిట:

'ఇంటినుంచి బయలుదేరివస్తున్నప్పుడు మీ కలంలో సిరా ఉందో లేదో చూసుకోక బోయారుటండీ, మేష్టారూ? '

అంతే, వెంకట్రామయ్యగారు అపర త్రినేత్రుడయిపోయారుట. పాపని చెడా మడా తిట్టడమేగాక కుడిచేతి అరచేయి తిరగేసి గట్టిగా బల్లకేసి బాదేరట. పాపకి పావుగంటదాకా ఏడుపే ఆగలేదుట. అంతలా నొప్పెట్టిందిట.

'ఒరే తమ్మూ నేనలా అడగడం తప్పేన్రా?'

తమ్ముడు జవాబు చెప్పేలోగా అందరూ జరిగింది చాటుగా వినెయ్యడం, అక్కడికి వచ్చెయ్యడం జరిగింది!

'అయ్యో నా తెలివి తెల్లారిపోనూ, ఇంకా పిల్ల ఎక్కడేనా పడిందేమోనని పెరటిదారినే ఉన్నాను నేను. ఆ కసాయి వాడు చేసిన పనా యిది? ఇంత చిన్న పిల్లని అంత పెద్ద దెబ్బ కొట్టడానికి వాడికి చేతులెలా వచ్చాయో! కాస్తలో అయితే పిల్ల చచ్చిపోను వీడి చేతులు విరగ.....'

అమ్మ మాటలు అలా ఎంతవరకు వెళ్ళునో నాన్న అడ్డుకున్నాడు.

'అలాగే...... ఇంకా దాని ముందు మేష్టర్ని తిడుతూ ఉండు. పిల్లకి చదువు బాగానే వస్తుంది!'

'ఓ ఇంతోటి ఘస్టుపారం చదువూ రాకపోతే మానెలెండి. మరేం పరవాలేదు పిల్ల నాకళ్ళముందు కులాసాగా తిరుగాడుతూంటే అంతే చాలు. చేజేతులా పిల్ల ప్రాణాలు తీసేస్తూఉంటే ఊరుకోగలమటండీ? ఈ విషయం ఏమిటో మీరు స్వయంగా వెళ్ళి కనుక్కొస్తేనే గాని నేను కుర్రదాన్ని గుమ్మమే దిగనియ్యను అనక నా పీక తీసేసినా సరే' అంది.

'అవున్నాన్నా వీళ్ళ ప్రవర్తన మరీ అమానుషంగా ఉంది. అమ్మ చెప్పినట్టు దీనికేదో చేస్తేగాని లాభంలేదు. ఇవాళ చెయ్యి విరికొట్టినవాడు రేపు బుర్ర బద్దలుకొట్టడని నమ్మకం ఏమిటి?'

'అవును నిజమే. చిన్న పిల్లలు తెలియక తప్పులు చేస్తారు పెద్దవాళ్ళు తెలిసికూడా చేస్తే ఎలా?' అన్నాడు తాత.

'అదే నేను అనబోయేది. ఇంట్లో తప్పు చేస్తే మనమే పిల్లల్ని ఒళ్లు తెలియకుండా కొడతాం. చదువు చెప్పి మంచీ చెడ్డా విడమర్చి చెప్పే మేష్టర్లు ఆ మాత్రం భయం చెబుతే అందులో తప్పేముంది!'

అని నాన్న మేష్టర్ని వెనకేసుకొస్తే తాత ఊరుకోలేకపోయాడు.

'అయితే? అందుకని ఒళ్ళూ పయీ తెలీకుండా పిల్లల్ని చావగొట్టుకుంటారా? ఆ వెర్రికోపంలో చేతికొచ్చినట్టు బాదేస్తే తరవాత ఎవర్ని ఎవరేమనుకుని ఏం లాభం? ఇన్ని స్ట్రయికులు జరుగుతున్నాయి. ఇంతింత అల్లర్లు అవుతున్నాయి. ఈ కుర్రాళ్ళ క్రమశిక్షణారాహిత్యానికి తామే చాలావరకు కారణమని ఈ మేష్టర్లు ఎందుకు గ్రహించరో? గ్రహించి ఎందుకు సరిదిద్దుకోరో.......'

'అందుకే మనకి బుద్ధి చెప్పవలసిన అవసరం ఉందంటాను. ఏమైనా సరే దీనికి ఏదో ఒకటి చెయ్యాలి నాన్నా!..........'

'అవునండీ, మీరు కలుగజేసుకుంటే గాని లాభంలేదు........'

నాన్న ఏమంటారోనని అందరూ ఆయనవైపు చూశారు. అందరికన్న ఎక్కువ ఆతృత పాపది. ఆ గొడవలో అది తన బాధే మరచిపోయింది.

'అలాగే మీరందరూ చెప్పినట్టు చెయ్యడానికి నాకేం అభ్యంతరం లేదు. కాని ఒక్క షరతు' ఆఖరి మాట విని అందరి ఉత్సాహం చప్పబడిపోయింది. నాన్న చెప్పుకుపోయాడు:

'పిల్ల ఒంటిమీద ఎందుకు చెయ్యి వేయవలసివచ్చిందో వెంకట్రామయ్య గార్ని తప్పకుండా నేను సంజాయిషీ అడుగుతాను. అలా ఇలా కాదు హెడ్మాష్టరు ద్వారా రాతమూలకంగా సమాధానం పుచ్చుకుంటాను. అంతేకాదు. అవసరమైతే డాక్టరు సర్టిఫికేటు పుచ్చుకుని కోర్టుకి కూడా ఎక్కుతాను. అయితే ఒకటి, నా పిల్లని రేపట్నుంచి ఆ మేష్టరు దగ్గిర చదువుకిపంపను..... ఏడాది మధ్యలో దానికి మరొక బడిలో సీటు ఇవ్వరు కూడాను!'

నాన్న గంభీరమైన మాటలని అమ్మ తేలికగా తీసిపారేసింది.

'ఎంతసేపూ మీరు ఇంట్లో పులీ. బయట పిల్లీను! ఊళ్లోవాళ్ళకి బుద్ధి చెప్పడం చాతకాక పిల్లని బడి మానిపించుకుంటామా! ఎవరిమీదండీ మీ పంతం. నాకు బోధపడక అడుగుతానూ? పిల్లని బళ్ళోకే పంపరూ. బతికాం. ఈపాటి పంతులయ్య ఈ ఊరి మొత్తంమీద దొరక్కపోడు పదిరూపాయలు మనవి కావనుకుంటే ఎగిరిగంతేసి కళ్ళకద్దుకుని మరొకడు రేపేపాటికి రాకపోడు. అంతేగాని కసిగందుని కసాయిశాలకి తోలుకుంటారుటండీ?'

నాన్న ఓడిపోలేదు, తన వాదాన్ని వెనక్కి తీసుకోనూలేదు.

'పిల్లల మనస్తత్వం గ్రహించలేని తల్లుల కబుర్లు ఇలాగే ఉంటాయి. పదిమందితో కలసి చదువుకోవాలనుందో, ఇంట్లో ఒకర్తీ రాణివాసం చెయ్యాలనుందో దాన్నే అడిగితే సరి! బళ్ళోకి వెళ్ళి

చదువుకోడమే నిశ్చయమైనప్పుడు దానికి చదువు చెప్పే గురువు మీద చర్య తీసుకోడం దాని విద్యాభివృద్ధికి ఎంతవరకు తోడ్పడుతుందో ఆలోచించండి. దానికి తగిలిన దెబ్బ ఇవాళో రేపో మానిపోతుంది. మానసిక గాయంకూడా కలుగజేస్తే ఎంతవరకు వెడుతుందో ఊహించండి. అటుపైన మీ యిష్టం.'

నాన్న అక్కణ్ణుంచి గబగబ నడిచి ఆఫీసు గదిలోకి వెళ్ళిపోయాడు.

'దీన్నే ఆశక్తీ దుర్జనత్వమూ అంటారు' అంది అమ్మ.

'మనమటుకు మనమే ఆలోచించి తగిన ప్రతి క్రియ చేద్దామే అమ్మా' అన్నాడు అన్న ఇంతలో పాపకి డ్యాన్సు చెప్పే నిర్మల అక్కడికి వచ్చి పాప పలకరించింది.

'ఏం చెప్పమన్నారు నిర్మలగారూ, ఒక్కొక్కొళ్ళ నిరంకుశత్వం అలా నిర్విచ్ఛన్నంగా సాగిపోతూ ఉంటుంది. అదేమని అడగడంకూడా తప్పుట....... లేత లేత చేతులు. ముట్టుకుంటే కందిపోయేవేళ్ళు ఎంత దెబ్బకొట్టాడో చూడండి.' పాప వేళ్లు సానుభూతితో సవరిస్తూ నిర్మల అందిలా:

'అందుకుకాదు. నామనసు మరొకందుకు దు:ఖపడుతోంది.'

'ఏమిటిది?'

'ఇదివరకు ఒకసారి చెప్పేను మీకు. మీ అమ్మాయి ప్రతిభ మీ దగ్గిర పొగడకూడదు అందుకనే ఏదైనా పుట్టుకతో రావాలన్నారు. ఏళ్ళతరబడి నేర్పితే పట్టుబడని నాట్యకళ మీ అమ్మాయి నెలల్లో నేర్చేసుకుంది. భావ రాగ తాళాలు ఇంత చిన్నపిల్ల ఇంత సుళువుగా ఒంటబట్టించుకుందంటే అది ఏ జన్మలో చేసిన సాధనో అనిపిస్తుంది. ముఖ్యంగా హస్త ముద్రలు పట్టడంలో మీ అమ్మాయి ఆరితేరింది అంత సునాయాసంగా వేళ్ళు తిప్పడం పాపకే చెల్లు. అలాంటిది'..... నిర్మల ఆగిపోయింది...... హఠాత్తుగా అన్న ఉద్రేకంతో లేచాడు.

'అమ్మా, నేను వెంకట్రామయ్య దగ్గిరకి వెడుతున్నాను. చేసిన పని ఏం బాగుందో నలుగుర్లో పెట్టి ఈడ్చేస్తా.'

'ఆగరా బాబూ....... ఆలోచించి చేద్దాంలే...'

'అదికాదు..... నిర్మలగారు వస్తేనేగాని నాకు జ్ఞాపకమే రాలేదు. ఇవాళ పదహారుకదూ....... ఇవాళరాత్రి కళానికేతన్ వారి డ్యాన్సుప్రోగ్రాం ఉంది టౌనుహాలులో........ ఆ డ్యాన్సు పార్టీలో మన పాపకూడా ఉంది.'

'ఉండటమేమిటి, ముఖ్య ఆకర్షణ ఆ అమ్మాయే. అందులో పాప చేసే 'మధురానగరిలో' అన్న నృత్యంకోసమే మూడొంతులుమందీ వచ్చేది.'

'అదే నే చెప్పేది..... ఇవాళ పాప ఎలాగా డ్యాన్సు చెయ్యలేదుగదా..... ఆ వెంకట్రామయ్యని ప్రత్యేకించి ఆహ్వానించి నలుగురి ఎదుటా పెడతాను. బ్యూటీ అండ్ ది బీస్ట్ అంటే ఏమిటో చెబుతాను. అందమంటే తెలిసిన ప్రతి ప్రభాకరుడూ తొంగిచూసి పొంగిపోయే హస్త పద్మాన్ని నలిపివేసిన కిరాతకుడెవరో ప్రతి ప్రేక్షకుడికీ పరిచయం చేస్తాను. అక్కడికిగానివాడికి బుద్ధి రాదు. ఏమే అమ్మా!'

'అవున్రా ఆ మాట బాగానే ఉంది' అంది అమ్మ

'నలుగురి ఎదుటా అవమానపడితే ముందు ముందు సరిదిద్దుకోడానికి అవకాశముంది. ఆ మాట బాగానే ఉందిరా'. అన్నాడు తాత.

'అంతా బాగానే ఉందిగాని అది సాధ్యమయేది మాత్రం కాదు' అంది నిర్మల.

'అదేం మళ్లీ!'

'ఏమీలేదు. ఇవాళ ప్రోగ్రాం పై ఆదివారానికి మార్చబడింది. అప్పటికి గాని, మంత్రిగారికి తీరిక అవదట. అది చెప్పడానికే నేను వచ్చాను పొన్లెండి. ఇదికూడా మన మంచికే వచ్చింది. లేకపోతే ఇంత ఆరితేరిన పిల్లా స్టేజి ఎక్కకుండా అయేది. ఈ గాయం మానడానికి నాలుగైదు రోజులకంటె ఎక్కువ పట్టదనుకుంటాను. చీము పట్టకుండా, సెప్టిక్ కాకుండా వెంటనే ఇంజక్షన్ మాత్రం ఇప్పించండి....... మళ్ళీ ఎల్లుండి వస్తాను.'

నిర్మల వెళ్ళిపోయింది. అమ్మ ఊరుకోలేకపోయింది

'నిలుచున్న పాళాన్ని పిల్ల చెయ్యి అయితే చిదిగిపోయింది గాని తప్పు చేసినవాణ్ణి దండించడానికి వెయ్యి ఆలోచనలూ. లక్ష అంతరాయాలూను కానియ్యి దేనికైనా కాలం ఖర్మం కాలిసి రావాలి.'

'మరేంమించిపోలేదు. ఇదివరిదాకా చూడకుండా నేను ఊరుకోదల్చుకోనూ లేదు..... ఇలారా..... కబురు' అమ్మచెవిలో అన్న ఏదో చెప్పేడు.

'ఏమిట్రా ఆ రహస్యం నాక్కూడా కాంచెం చెప్పకూడదూ?' అన్నాడు తాత.

అన్న తాత దగ్గిరకి వెళ్ళి నెమ్మదిగా ఏదో చెప్పేడు.

'అలా చేయిస్తివా వీడికే కాదు చేతివాటుతనం ఉన్న వాళ్ళందరికీ బుద్ధొస్తుంది' అన్నాడు తాత.

'వీళ్ళు మేష్టారిని ఏంచేద్దామనుకుంటున్నారే అక్కా!' అన్నాడు తమ్ముడు ఆ ప్రశ్నకు జవాబుగా పాప గుండె దడదడ కొట్టుకుంది. ఏమో ఎవరికి తెలుసు?

✪

'కొసరి కొసరి నాతో సరసములాడకు. రాజమార్గమిది కృష్ణా' పాప డ్యాన్సు ప్రాక్టీసు చేస్తోంది. ఆ రోజునే కొంచెం వ్రేళ్ళు చెప్పినట్టు వింటున్నై. ఆ వాళకి మూడో రోజు డ్యాన్సు ప్రోగ్రాం. ఇంకా వేళ్ళు కదపొద్దని అమ్మ దెబ్బలాడి వెళ్లింది. అయినా పాపకి ఓసారి సరిగ్గా కదుల్తాయో నొప్పెడతాయో బాగా కెరటాల్లా తిప్పి చూసుకోవాలనుంది. అందుకనే పెరట్లో గడ్డివాము చాటుకుపోయి అక్కడ ప్రాక్టీసు చేస్తోంది. గోడమీదినుంచి తమ్ముడు ఒక్కసారి కిందకి గెంతేడు.

'అబ్బ ఏం పన్లురా అవీ? ఏమిటో అనుకుని హడలిపోయాను.'

'వెంకట్రామయ్య మేష్టారిని అన్నయ్యా వాళ్లూ ఏం చెయ్యదల్చుకున్నారో నాకు

తెలిసిపోయిందిలే. ఇందాక వాళ్లు బాదంచెట్టుకింద మాటాడుకుంటూంటే కొమ్మమీంచి నేను విన్నానులే. నీకు చెప్పనులే?

'చెప్పరా దానికింత ఆలశ్యం ఎందుకూ?'

'అమ్మా ఎంతాశ? ఒకసారి రంగుపెనసిలిమ్మంటే అరిగిపోయావు కాని'

'ఒకసారేం, ఏకంగా ఇచ్చేస్తాగా!'

'అయితే విను'

తమ్ముడు చెప్పేడు చెప్పకపోయినా బాగుణ్ను. అది మొదలు ఆ మర్నాడు సాయంకాలందాకా పాప మనసు మనసులో లేదు పెనుతుఫానుకి నునులేత ఆకు అల్లల్లాడినట్టు వయసుకి మించిన బావాలతో శక్తికి మించిన తలపులతో పాప మనసు గిలగిల కొట్టుకుంది. విల విల తన్నుకుంది.

ఆడి ఆడి అలసివచ్చి అమ్మ పెట్టిన వేడివేడి అన్నం కడుపులో పడగానే చుక్కల కన్నులు తెరవకుండానే తన చక్కని కన్నులు మూతపడిపోయేవి. ఇక ఆ మత్తునిద్రలో ఆ ప్రాణం ఎక్కడెక్కడ విహరించేదో. అమ్మ పిర్రమీద చుర్రుమనిపించేదాకా ఆ రెప్పలు విడేవి కావు. కాని ఆ రాత్రి అందరూ పడుకున్నా పాప మేలుకునే ఉంది. తనకి తోడుగా మేలుకొని ఉన్న సున్నాలా ఉన్నా ఉన్నానని వెలుగుతున్న జీరోవాల్టు బల్బూ, ఆ పక్కనే అటూ యిటూ ఊగుతూ కాలచక్రం ముందుకి నడుపిస్తున్న గోడగడియారమూ.

వెంకట్రామయ్య మేష్టారిని అన్నయ్యా వాళ్ళూ ఏం చెయ్యదల్చుకున్నారో విన్నాక మొట్టమొదట పాప మనసు ఉత్సాహంతో ఉరకలు వేసింది. అవును ఆయన కా శిక్షతగినదే అనిపించింది. ఆ వెర్రి కేకలు చూసి మొదట్లో తను భయపడింది ఆ పిచ్చి దెబ్బలు చూసి తను అసహ్యించుకుంది. తనకే కాదు ఆ మేష్టారంటే ఎవరికీ యిష్టంలేదు. ఆ మేష్టారేకాదు. కొట్టే మేష్టర్లంటే ఎవరికీ ఎప్పుడూ యిష్టం ఉండదు. వేళ్ళమీద తట్లు తేరిపోతాయి. బుర్రలు బొప్పి కట్టిపోతాయి. ఇలా చెయ్యి పట్టుకుని వెనక్కి తిప్పుతూంటే ఎముకలు విరిగిపోతాయా అన్నంత నొప్పి పెడతాయి. పిల్లలు మొర్రోమని ఏడుస్తారు. బావురుమని బాదపడతారు. గొల్లున గోలెడతారు. పాఠాలు అంటే తెలుగూ, ఇంగ్లీషూ, లెక్కలూ, సైన్సూ, సోషల్ స్టడీసూ ఇవి కావా? టెంకిజెల్లలూ, బెంచీ ఎక్కించడాలూ గోడ కుర్చీలూ యివేనా? ఇందుకేనా నెలనెలా పిల్లలూ జీతాలు కట్టి మేష్టర్లని పోషిస్తున్నది.?

అయితే వెంకట్రామయ్య మేష్టారు మొన్న ఈ మధ్య తప్ప తన వంటి మీద ఎప్పుడూ చెయ్యి వెయ్యలేదు. పైగా తనంటే ప్రత్యేకమైన ఇష్టంకూడా. అంత కోపమున్న మేష్టారూ ఆవాళ పట్టుపట్టి తనచేత స్కూల్లో 'మధురానగరిలో' డ్యాన్సు చేయించి ఎన్నో విధాల మెచ్చుకున్నారు. అవాళ ఆయన మొహం ఎంతో బాగుంది. ఆయనకు నవ్వడం మెచ్చుకోవడం కూడా తెలుసన్నమాట.' అని మొట్టమొదట అనిపించింది. అంతవరకూ బాగానే ఉంది. తను చెప్పిన న్యాయమైనమాటే తనకి తిరిగి చెప్పినపుడు అన్యాయంగా అసందర్భంగా అంత కోపం ఎందుకు రావాలి? పోనీ పెద్దవాళ్ళని అదేమని

అడగడమే తప్పయితే నాలుగుమాటలూ అని ఊరుకోవచ్చు, నాలుగువేళ్ళూ పట్టుకుని పచ్చడి చెయ్యాలా? ఆయనగారికి అంతే కావాలి. అనుకున్నది పాప మళ్ళీ కసిగా లేకపోతే ఈ వారంరోజులూ తనెంత బాధపడింది! పళ్లు తోముకోలేకపోయేది. అన్నం ముద్దచేసి నోట్లో పెట్టుకోలేకపోయేది. ఏదీ చేత్తో పట్టుకోలేకపోయేది అన్నీ పాపం అమ్మ చేసిపెట్టింది కాని లేకపోతే ఏమయేది? డ్యాన్సుమాట దేముడెరుగు. చెయ్యి ముడుచుకోడమే ఎంతో బాధగా ఉండేది. అమ్మ చెప్పినట్టు ఆ దెబ్బ మరికాస్త గట్టిగా తగిలి వ్రేళ్ళలోని ఎముకలు విరిగిపోతే? అప్పుడు ఏమయ్యేది, ఏమయ్యేది?

మేష్టారూ, మీ శిష్యులు పడుతున్న బాధ మీకు తెలిసిరావడం న్యాయమే. అనుకుంది మళ్ళీ పాప. నిజం చెప్పవలసివస్తే ఈ వారంరోజుల్లోనూ తను ఒక్కర్తేనా బాధపడింది? ఆ చెయ్యి కట్టు విప్పేదాకా నాన్నకి తోచలేదు. ఆ వ్రేళ్ళు సవరించి తృప్తిపడేదాకా తాత ఉండబట్టలేడు ఆ వ్రేళ్లకి తీయించిన ఎక్స్‌రే ఫొటోగ్రాపు చూసేదాకా అన్నయ్య అదటు తగ్గలేదు. డ్యాన్సు మేష్టారు నిర్మల ఆత్రుత రోజుకి రెండుసార్లు కబుపంపిస్తేగాని తీరలేదు. అమ్మ అభిమానంతో కూడిన ఆందోళనా. సేవా ఇక వర్ణించడానికి లేదు. ఆఖరికి అల్లరివెధవ అయిన ఆ తమ్ముడూకూడా 'వేళ్ళనొప్పి ఎలా ఉందే అక్కా.' అని కనుక్కోని క్షణం లేదు. ఇందర్నీ ఇన్ని విధాల బాధపెట్టిన వాళ్ళని నిజానికి ఏం చేసినా తప్పులేదు.

పాప గోడగడియారం లోలకంకేసి చూసింది. అది అటూ ఇటూ కొట్టుకుంటోంది. దాన్ని చూసేసరికి పాప గుండె వేగం ఎక్కువైంది. తనుకూడా అదే స్థితిలో ఉందాయేం?

మేష్టారికి తగిన శిక్ష విధించబడడమే తన కోరిక అయితే ఆ తృప్తితో హాయిగా నిండుగా తనకెందుకు నిద్రపట్టలేదు? నిజంగా ఆయన్ని బాధించడం తనకి అంతరాంతరాల్లోయిష్టంలేదా? పాపకి ఓ కథ గుర్తొచ్చింది. అరటి మొక్క తినేసిందని ఆ ఇంటివాళ్ళు ఆ ఆవుని చచ్చే దెబ్బలు కొట్టేరు. వాతం కమ్మి ఆ ఆవు చచ్చిపోయింది. చచ్చిపోయిన అరటిపిలక చిగురించిందా, లేదు! పోయిన ఆవు బతికొచ్చిందా, లేదు! మరేం జరిగింది? తల్లిపాలు లేక ఆ ఆవు నెలలదూడ ఒకటి చచ్చిపోయింది!

ఎన్నిసార్లు వద్దనుకున్నా పాపకి ఆ కథే జ్ఞాపకం వచ్చింది. పరమయోగుల్నీ మహాపండితుల్నీ నిలదీసిన ప్రశ్న పదేళ్ళ పాప ముందు నిలిచింది. పగతో పగ చల్లారితుందా?

అన్నయ్య అమ్మతో అన్నమాటలు పాప ఊహించుకుంటోంది. 'చూడమ్మా.... ఇవి నాన్నతో చెప్పి ఆయన్ని ఒప్పించి చేసుకునే పనులుకావు. పాప వేళ్ళు మళ్ళీ మామూలుగా అయిపోయాయికదా అని నిర్లక్ష్యం చేయవలసిన విషయమూ కాదిది. నేరస్తుణ్ణి శిక్షించకుండా ఊరుకోవడమే అన్యాయం..... నేను అన్నీ కనుక్కుని ఏర్పాట్లన్నీ పూర్తిచేశాను. వెంకట్రామయ్యగారిల్లు కొత్తపేటలో ఉంది. రాత్రి తొమ్మిది దాటిన తరవాత అక్కడ బాగా నిశ్శబ్దంగా ఉంటుంది. ఎవరూ పిలిచినా పలకరుకూడా. ఆయనా భార్యా కాక కళ్ళు కనిపించని ముసలితల్లీ ఎప్పుడూ మూర్ఛరోగంతో పడుండే పన్నెండేళ్ళ కొడుకూ వీళ్ళిద్దరే ఆయనకి రక్ష. వీధి గుమ్మంలోంచి యింట్లోకి వెళ్ళడానికి ఓ ఏభై గజాల సందుుంది.

ఏ తొమ్మిదిన్నరకో వెళ్ళి ఆయన వీధి తలుపు గుద్దితే ఎవరో అనుకుని తీస్తారు ఇద్దరు రౌడీలతో వెళ్ళి కాస్త బలమైన చేపాటి కఱ్ఱతో కాళ్ళు ముణుకుల్ని గౌరవిస్తినా పదిరోజులపాటు మనపేరు చెప్పుకుని పక్కమీద బబ్బుంటాడు! పాపం పుణ్యం తెలియని పసిపిల్లల్ని బాధపెట్టే పాపాత్ముల్ని ఇలాగే జాలి అన్నది చంపుకుని, వేటాడాలి. వారంరోజుల పాటు ఇంటిల్లిపాదీ వెఱ్ఱెత్తిపోయామే, అప్పుడే మరచిపోయావా? ముల్లుని ముల్లతోనే తియ్యాలని చెప్పనదానిని నువ్వేకద? మరేం నిరుత్సాహ పరచకు. రేపురాత్రి సరిగ్గా తొమ్మిదీ పదీ మధ్య అలాగేనా?"

"ఐతే నీ యిష్టం. చాలా జాగ్రత్తగా మాత్రం వ్యవహరించు." అంది అమ్మ.

పాప గడియారం కేసి మళ్ళీ చూసింది. లో(ల)కం మరింత త్వరగా ముందుకి తిరుగుతున్నట్టనిపించింది.

రేపు రాత్రి సరిగ్గా తొమ్మిదీ పదీ మధ్య ఎంతసేపట్లో రావాలి? పాప గుండె మరింత వేగంతో కొట్టుకుంది. ఆ గడియారాన్ని చూడలేక లైటు ఆర్పేసింది. కళ్ళు మూసుకుంది. మనసులో చీకటి మరింత ఎక్కువైంది. దారీ తెన్నూ దొరకని ఆలోచనలతో పాప తల్లడిల్లిపోయింది.

పెద్దవాళ్ళు చదివిన పత్రికలన్నీ చదువుతుంది. వాళ్ళతో సినిమాలు చూస్తుంది. ఇంట్లో అందరూ తనకు వినబడేలాగే వాదించుకుంటారు. వయసుకి పసిదైనా పాప మనసు పరువానికొచ్చింది. అందుకే పదే పదే బాధపడుతోంది.

తనకి నాలుగువేళ్ళు బాగా నొప్పెడితే యింటిల్లిపాదీ కొట్టుకుపోయారు. వెంకట్రామయ్య మేష్టారి రెండుకాళ్ళూ విరిగితే, విరిగితే?

ఇంట్లో వాళ్ళకి చెప్పకుండా ఆ పాప ఓ నిశ్చయానికి వచ్చేసింది. పెరటి తలుపు చేరేసి నెమ్మదిగా మేష్టారి ఇల్లు చేరుకుంది. వెంటనే ఆయన్ని కలుసుకోవాలని ప్రయత్నించింది. ఆయన భార్య సీతారత్నం ఆ సంగతి వారితో చెప్పింది.

ఎందుకూ? అన్నట్టు మేష్టారు సీతారత్నం వైపు చూశారు. పాప తలవంచుకుని కూచుని తనలో మాటాడకుంటున్నట్లు నెమ్మది నెమ్మదిగా ఒకొక్క ముక్కా పూర్తిగా చెప్పేసింది, వణుకుతున్న కంఠంతో.

'అవాళ అలా మిమ్మల్ని ఎదిరించడం తప్పు. ఇంతవరకు వస్తుందని నాకు తెలీదు. ఇంకెప్పుడూ అలా జవాబు చెప్పను. ఇంక ఆలస్యం చెయ్యకండి.' అంటూంటే ఆమె కన్నీళ్ళు ఆగలేదు.

పాప తలెత్తి చూసేసరికి సీతారత్నం మొహం కనిపించింది. కృతజ్ఞతా భారంతో ఆమె కళ్ళు నిండి ఉన్నాయి. పాప మేష్టారి మొహం చూసింది. సర్వమూ కోల్పోయినట్టూ, సర్వస్వమూ దొరికినట్టూ ఒకేసారి కనిపిస్తోంది ఆయన చూపుల్లో.

'పాపా ఇలా రా తల్లీ' గద్గద కంఠంతో వెంకట్రామయ్యగారు రెండు చేతులూ జాచేరు పాప దగ్గిరిగా వెళ్ళింది. కౌగలించుకుని కష్టంతో కన్నీళ్ళు ఆపుకున్నారు. పాపని పెరట్లోకి తీసుకెళ్ళేరు.

'సీతా లాంతరు పట్టుకురా! పూజా మందిరం తలుపు తియ్యి' అదొక పాత బడిన చిన్న గది. బూజు లతో భయంకరంగా ఉంది.

'ముందు దీన్ని శుభ్రం చెయ్యి'. సీతారత్నం తొందర తొందరగా గదంతా ఊడ్చింది. అందులో ఏ సామాన్లు లేవు దేవుళ్ళని పెట్టుకునే నలుచదరపు ఎత్తైన పీఠంమాత్రం ఉంది.

"పాపా!....... ఒకప్పుడు ఈ పీఠంమీద వెండి పూత పూసిన పెద్ద లక్ష్మీ విగ్రహం ఉండేది నా చేత్తో నేను ప్రతి రోజూ పెరట్లోని పారిజాతపు పువ్వులు కోసి తెచ్చి పూజ చేసేవాణ్ణి. ఓ రోజు కో రోజు బీదరికం చుట్టబెట్టి నాలోని భక్తి భావం సన్నగిల్లింది. పూజలు మానేశాను. ఒకనాటి ఆర్థిక దుస్థితిలో ఈ విగ్రహమే అమ్ముకోవలసి వచ్చింది. నిజంగా ఇంట్లోంచి లక్ష్మే నడిచి వెళ్ళిపోయిన ఆనాటినుంచే నా కష్టాలు ఎక్కువయ్యాయేమో? పాపా! ఈనాడు నీ రూపంలో మళ్ళీ లక్ష్మి నడిచి మా యింటి కొచ్చి నన్ను రక్షించింది. పతిత పావనమూర్తి అయిన ఆదేవికీ నీకూ తేడా ఏమిటి గనక! ఆ పీఠంమీద కూచో...... నిన్ను కన్నీటితో అభిషేకిస్తాను. హృదయంతో పూజిస్తాను. ఆత్మతో ఆరాధిస్తాను." సీతారత్నం కన్నీరు తడుచుకుంది.

✪

'మనుషులకి బుద్ధిచెప్పడానికి పట్టుదలలూ, ప్రతిజ్ఞలూ, కత్తులూ, కటారులూ కావాలా? వీళ్ళ వెర్రిగాని! అనుకుంటూ తలుపు చప్పుడు కాగా విని ధైర్యంగా తలుపు తీసింది సీతారత్నం.

'వెంకట్రామయ్యగా రెక్కడ?' అంటూ చేపాటికర్ర కింద గట్టిగా కొట్టి పాప అన్నయ్య ప్రశ్నించాడు 'ఉష్ గొడవ చెయ్యకండి! అంటూ సీతారత్నం వాళ్ళ ముగ్గుర్నీ నెమ్మదిగా నడిపించుకుని వీధిగది కిటికీలోంచి లోపలికి చూపించింది. పాప అన్నయ్యకి నోట మాట రాలేదు! 'ప్రజవనితలు నను చేరవత్తు రిక విడు విడు నా చేయి కృష్ణా' పాప డ్యాన్సు చేస్తోంది. వెంకట్రామయ్యగారు తాళం వేస్తున్నారు. వాళ్ళిద్దరూ వచ్చినవాళ్ళ రాక గమనించనంత తన్మయత్వంలో ఉన్నారు.

'రేపు పాప టౌనుహాలులో డ్యాన్సు చేస్తుందిటగా..... ఆఖరిసారి గురువుగారి దగ్గిర డ్యాన్సు చేసి ఆశీర్వాదం పొందుదామని వచ్చింది అవసరమైతే పిలుస్తాను. ఏం అంత ముఖ్యమా?' అంది సీతారత్నం.

'అంత ముఖ్య మేం లేదులెండి! అఘోరించనివ్వండి. మధ్యని నాకేం!' వాళ్ళు వెళ్ళిపోయారు. ముసిముసి నవ్వులు నవ్వుతూ సీతారత్నం తలుపేసుకుంది.

✪

మళ్లీ ఈ లోకంలోకి వచ్చిన మేష్టారు వాసు తలనిమురుతూ అన్నారు:

'హోంవర్కు చెయ్యకపోతే ఎవరికిరా నష్టం? రేపు తప్పకుండా చెయ్యేం?'

ఆయనకి ఆ రాత్రి పాపతో సంభాషణ మరోసారి జ్ఞాపకం వచ్చింది.

'పాపా ఇంతరాత్రి నాకోసం వచ్చావు నిన్ను బాధించినా, నన్ను కాపాడేవు! నీ కేం కావలసినా

ఇస్తాను చెప్పు!'

'మేష్టారూ! మీరంటే నాకు ఇష్టం. కాని అందరికీ భయం. మీరంటే నాకు యిష్టం కనుక మీరందరికీ భయం భయంగా ఉండడం నాకు బాగులేదు అందుకని.... ఎవర్నీ కొట్టకండి మేష్టారూ!' ఆ పాప ఇప్పుడు లేదు. వాళ్ళ నాన్న గారికి బదిలీ అయి ఎక్కడికో వెళ్ళిపోయింది. అయితేనేం. ఆ సంకీర్తనం ఉంది 'కొసరి కొసరి నాతో సరసములాడకు'..... అనే సంప్రార్థనం ఉంది. సర్వమత సమ్మతమైన సందేశమూ ఉంది.

★